సాక్షి ఖమ్మం

బుధవారం । 26 । జూన్ । 2024



మత్తులో చిత్తు కావొద్దు

గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు పిల్లలు అలవాటు పడకుండా తల్లిదండ్రులు గమనించాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో



ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..

బొగ్గు గనుల ప్రైవేటీకరణను పోరాటాలతో అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ప్రమాణస్వీకారం చేసిన ఎంపీ రఘురాంరెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం పార్లమెంట్ సభ్యుడిగా విజయం సాధించిన రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన రెండో రోజు తెలంగాణ ఎంపీలకు అవకాశం ఇచ్చారు. ఈసందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన రఘురాంరెడ్డి జైహింద్, జై తెలంగాణ, జై సంవిధాన్(రాజ్యాంగం) అంటూ ముగించారు. కాగా, తనపై నమ్మకంతో గెలిపిన ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధి ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు అన్నిరంగాల్లో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

సాగు ఆయకట్టు పెంచేలా పనులు

ఖమ్మంఅర్బన్: ప్రస్తుతం ఉన్న సాగు ఆయకట్టును మరింత పెంచేలా మంజూరైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని ఇరిగేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి పటేల్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఆయన జలవనరులశాఖ సీఈలు, ఎస్‌ఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. మంజూరైన పనుల్లో అత్యవసరమైనవి గుర్తించి చేపట్టాలని తెలిపారు. తక్కువ సమయంలో, తక్కువ నిధులతో చేపడితే ఆయకట్టు పెరుగుతుందని భావించే పనులను మొదట పూర్తిచేస్తే ఫలితం ఉంటుందని చెప్పారు. ఈమేరకు అధికారులు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి జలవనరులశాఖ సీఈ విద్యాసాగర్, ఎస్‌ఈలు హాజరయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడమే కాక అన్ని వసతులు కల్పిస్తున్నందున విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. మండలంలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం సమకూరుస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నందున తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు. అనంతరం 9, 10వ తరగతుల విద్యార్థులను పలు అంశాల్లో పరీక్షించారు. హెచ్‌ఎం రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సెలవులో కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఈనెల 29వ తేదీ వరకు వ్యక్తిగత సెలవులో వెళ్లారు. గత శనివారం సెలవుపై వెళ్లిన ఆయన జూలై 1వ తేదీ సోమవారం తిరిగి విధుల్లో చేరనున్నట్లు తెలిసింది. కాగా, ఖమ్మం కలెక్టర్‌గా రాకముందే ఆయన సెలవు కోసం రెండు నెలల క్రితం ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

ప్రశాంతంగా హాస్టల్ వార్డెన్ పరీక్ష

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజీపీఎస్సీ) ఆధ్వర్యాన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల ఎంపికకు నిర్వహిస్తున్న పరీక్షలు రెండో రోజైన మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో ఉదయం పరీక్షకు 1,610మందికి 1,109మంది, మధ్యాహ్నం పరీక్షకు 1,117మంది అభ్యర్థులు హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీకి రంగం సిద్ధం

ఖమ్మంవన్‌టౌన్: జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరగనున్నాయి. ఇప్పటికే ఎంపీడీఓల నుంచి అధికారులు సమాచారం తెప్పించుకుని జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 589 గ్రామపంచాయతీలు ఉండగా గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులు 26 మంది, గ్రేడ్-2 కార్యదర్శులు 31మంది, గ్రేడ్-3 కార్యదర్శులు 39మంది, గ్రేడ్-4 కార్యదర్శులు 321మందితో పాటు ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు 25, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 135 మంది సహా 577 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఓపీఎస్‌లు, జేపీఎస్‌లు మినహా మిగతా వారిలో నాలుగేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న వారికి బదిలీ ఖాయమని తెలుస్తోంది. సెలవులో ఉన్న కలెక్టర్ విధుల్లో చేరగానే ప్రక్రియ మొదలుకానుంది.

ఆపరేషాన్..

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిగా ఉన్నప్పుడు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తూ వేలాది మంది పాలిట వరప్రదాయినిగా నిలిచేది. ఈక్రమంలోనే జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు సైతం సొంతమయ్యాయి. కానీ ఆ ఘన కీర్తి ఇప్పుడు మసక బారుతోంది. మెడికల్ కాలేజీ ఏర్పాటుచేయగా, దానికి అనుసంధానంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిగా మారడంతో వైద్యుల సంఖ్య పెరిగినా పూర్వపు పరిస్థితులు మచ్చుకైనా కానరావడం లేదు. దీంతో వివిధ రకాల అనారోగ్య సమస్యలతో దూరప్రాంతాల నుంచి వస్తున్న వారికి నిరాశే ఎదురవుతోంది. వైద్యుల నిర్లక్ష్యానికి తోడు అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కొంతకాలం నుంచి శస్త్రచికిత్సలు తగ్గుముఖం పట్టాయి. – ఖమ్మంవైద్యవిభాగం



ఖమ్మం పెద్దాస్పత్రిలో శస్త్రచికిత్సలపై నీలినీడలు

- మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వైద్యుల సంఖ్య పెరిగినా వీడని నిర్లక్ష్యం
- చుట్టపుచూపుగా వచ్చివెళ్తున్న పలువురు వైద్యులు
- ఫలితంగా ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్న రోగులు

కాన్పులపైనే దృష్టి

ఖమ్మంలోని జనరల్ ఆస్పత్రికి ఉమ్మడి జిల్లా నుంచే కాక సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి సైతం వైద్యం కోసం వస్తుంటారు. ఏటేటా ఇక్కడకు అనారోగ్య సమస్యలతో వస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కానీ ఇక్కడి వైద్యులు కేవలం కాన్పులపైనే దృష్టి పెడుతుండడంతో సాధారణ శస్త్రచికిత్సలు జరగక పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అయితే, కొన్నాళ్లుగా ప్రసవాలు చేయడంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ కారణాలతో అనారోగ్యం పాలైన వారికి శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా.. కనీసం ఓపీలో వైద్యులు చేయిపట్టి నాడి చూడడానికి ఇష్టపడడం లేదని తెలుస్తోంది. ఏదో వచ్చారు.. చూశాం అన్నట్లు మందులు రాసి పంపిస్తుండడంతో వ్యాధి నయం కాకపోగా మరింత ముదురుతోంది. ఇక ఇన్‌పేషెంట్లుగా చేర్చుకున్న వారి విషయంలో నిర్లక్ష్యంగా ఉంటుండడంతో తరచుగా రోగులు, సిబ్బంది నడుమ వాగ్వాదం జరుగుతోంది.

సమయపాలన పాటించక...

పెద్దాస్పత్రికి వచ్చే వారికి జనరల్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, గైనిక్ విభాగాల్లో సర్జరీలు అవసరమవుతాయి. ఆయా విభాగాలకు వచ్చిన వారిని వైద్యులు పరీక్షించి త్వరగా నయమవుతుందనుకుంటే మందులు రాయడం.. లేదంటే ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని శస్త్రచికిత్స చేయాలి. కానీ కొందరు వైద్యులు సమయపాలన పాటించక.. ఇంకొందరు వచ్చినా కాసేపటికి తిరుగుముఖం పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగా రోగులు డాక్టర్ల కోసం రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఎక్కువ మంది వైద్యులకు సొంత క్లినిక్‌లు ఉండడంతో పెద్దాస్పత్రి ముఖం చూసేందుకు ఇష్టపడడం లేదని తెలుస్తోంది. శస్త్రచికిత్స అవసరమైన వారిని సైతం భయపెట్టి తమ సొంత ఆస్పత్రులకు తరలిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఒక్కో విభాగంలో రోజూ రెండు, మూడుకు మించి ఆపరేషన్లు జరగక పోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. కేవలం గైనిక్ విభాగంలో మాత్రం నిత్యం ప్రసవాలు, శస్త్రచికిత్సలు జరుగుతుండగా.. గతంతో పోలిస్తే ఎంసీహెచ్‌లోనూ ప్రసవాల సంఖ్య తగ్గుముఖం పట్టడం గమనార్హం. మరోపక్క ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక జూనియర్ వైద్యులు ప్రసవాలు చేస్తుండడం పలు సందర్భాల్లో గర్భిణులు, శిశువుల ప్రాణాల మీదకు వస్తోంది.

పెద్దాస్పత్రిలోని వివిధ విభాగాల్లో కొద్దినెలలుగా శస్త్రచికిత్సల వివరాలు

నెల	మైనర్ సర్జరీలు	మేజర్ సర్జరీలు
ఏప్రిల్-23	614	576
మే	739	749
జూన్	640	630
జూలై	781	717
ఆగస్టు	705	708
సెప్టెంబర్	698	626
అక్టోబర్	660	576
నవంబర్	664	545
డిసెంబర్	615	526
జనవరి-24	591	504
ఫిబ్రవరి	491	457
మార్చి	509	449
ఏప్రిల్	550	473
మే	520	533

స్థాయి పెరిగినా సేవలు పెరగట్లే..

సహజంగా ఆస్పత్రి స్థాయి పెరిగితే శస్త్రచికిత్సల సంఖ్య పెరగాలి. కానీ పెద్దాస్పత్రిలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. గత ఏడాది ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కాలేజీ ఏర్పడడంతో 575 పడకలతో హైదరాబాద్ తర్వాత స్థాయికి చేరింది. అందుకు తగ్గట్లుగానే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వచ్చారు. ప్రతీ విభాగానికి ప్రస్తుతం పది మంది వరకు వైద్యులే కాక సీనియర్ రెసిడెంట్ వైద్యులు, డీఆర్‌పీలు కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. అవసరానికి తగినట్లు వైద్యులు ఉన్నా ఎవరెప్పుడు వచ్చి, వెళ్తున్నారో చూడాల్సిన అధికారుల నిర్లక్ష్యంతో వైద్యసేవలు అందడం లేదు. ఫలితంగా సీనియర్ రెసిడెంట్ వైద్యులు, డీఆర్‌పీలపై ఆధారపడుతుండగా అత్యవసర శస్త్రచికిత్సలు అవసరమైన వారు రోజుల తరబడి తిరగలేక అనివార్యంగా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు.

శస్త్రచికిత్సలు పెంచేలా చర్యలు...



ఆస్పత్రిలో సాధారణ శస్త్రచికిత్సలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. రోగుల విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవు. వైద్యులు నెలవారీ లక్ష్యాలను పూర్తిచేసేలా సూచనలు చేయడంతో పాటు ఓపీ విభాగంలో అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. పేదలకు సేవల్లో అంతరాయం ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రక్షాళన చేయాల్సిందే..

కేఎంసీలో ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యం

- పలు విభాగాలను శాసిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది
- అధికారులను సైతం ఏమారుస్తున్న వైనం
- ఎవరైనా ప్రశ్నిస్తే ప్రజాప్రతినిధులతో ఫైరవీలు
- కొత్త కమిషనర్ ఎదుట సవాళ్ల పర్వం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కొందరు సిబ్బంది విభాగాల్లో అంతా తామై వ్యవహరిస్తున్నారని కేఎంసీలో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల కన్నా వీరి పెత్తనమే ఎక్కువైందని, అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా తాము చెప్పిందే వేదం అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక కంప్యూటర్ ఆపరేటర్లు కేటాయించిన విభాగాల్లో కాకుండా అంతా ఒకే గదిలో కూర్చుని కార్యకలాపాలు సాగిస్తున్నారనే విమర్శ ఉంది. ప్రధానంగా శానిటేషన్, రెవెన్యూ, ఇంజనీరింగ్, అకౌంట్స్, ఐటీ, ఎన్నికలు, పరిపాలన విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెత్తనం అధికమైందని తెలుస్తోంది. ఈనేపథ్యాన కమిషనర్‌గా విధుల్లో చేరిన అభిషేక్ అగస్త్య తొలుత కార్యాలయ ప్రక్షాళన నుంచే తన పని ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

అంతా అక్కడి నుంచే..

కేఎంసీలో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది కొరత కారణంగా పలువురిని ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించారు. వీరిలో కొందరికి కంప్యూటర్ ఆపరేటర్లుగా హోదా కల్పించి విభాగాలకు అప్పగించారు. ఇందులో పలువురు అధికారులు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ బృందంగా ఏర్పడి కార్యాలయంలో తమకంటూ ఒక ప్రత్యేక గది ఏర్పాటు చేసుకున్నారు. రెవెన్యూ, గ్రీవెన్స్, కమిషనర్ పేషీ, సిస్టమ్ మేనేజర్ విభాగాలకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లు సాంకేతిక విభాగం పేరుతో అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారు. వారికి నచ్చిన ఫైళ్లను పరిష్కరిస్తూ.. ఇతరులవి పక్కన పెడుతున్నారనే విమర్శలు చాన్నాళ్లుగా ఉన్నాయి. ఏళ్ల తరబడి వీరంతా అదేవిభాగాల్లో పనిచేస్తుండడంతో అజమాయిషీ కరువవగా.. విభాగాల్లో కాకుండా అంతా ఒకేచోటకు చేరడంతో ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

విధుల్లో చేరిన కమిషనర్ అభిషేక్ అగస్త్య



మేయర్ నీరజకు మొక్క అందజేస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి అదనపు కలెక్టర్‌గా ఉన్న ఆయనను కమిషనర్‌గా బదిలీ చేయగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మేయర్ పునుకొల్లు నీరజను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఆతర్వాత కమిషనర్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల అధికారులతో సమావేశమై ప్రస్తుతం జరుగుతున్న పనులపై ఆరా తీశారు. అలాగే, అకౌంట్స్ విభాగం అధికారితో సమావేశం సందర్భంగా కేఎంసీలో నిధుల నిల్వలు, పెండింగ్ బిల్లులపై చర్చించారు. మధ్యాహ్నం నగరంలోని బోనకల్ రోడ్డు, మమత రోడ్డు మార్గాల్లో కమిషనర్ అభిషేక్ పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రంజిత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఏ.సంపత్‌కుమార్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, డీఈలు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

పాతుకుపోయారు..

కేఎంసీలో రెవెన్యూ, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాల్లో ఉద్యోగులు, అధికారులు ఏళ్ల తరబడి పాతుకుపోయి ఉన్నారు. ఇటీవల కొందరి విభాగాలు మార్చినప్పటికీ ఉద్యోగుల తీరు మాత్రం మారలేదని తెలుస్తోంది. కొందరు ఉద్యోగులు చెప్పా పెట్టకుండానే విధులకు గైర్హాజరు కావడం పరిపాటిగా మారిందని సమాచారం. ఈ నేపథ్యాన నగరాభివృద్ధి ఎంత ముఖ్యమో... కార్యాలయాన్ని ప్రక్షాళన చేయడం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని కొత్త కమిషనర్ గుర్తించాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

కేఎంసీనా.. సాఫ్ట్‌వేర్ కంపెనీయా?

కార్పొరేషన్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ల సంఖ్యను చూస్తే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీని తలదన్నేలా ఉంటుంది. ఒక్కో విభాగంలో ఇద్దరి నుంచి నలుగురు, ఐదుగురు వరకు ఆపరేటర్లను నియమించగా.. వీరు పనిచేయడం కన్నా బయట తిరగడం పైనే శ్రద్ధ వహిస్తారనే విమర్శలున్నాయి. ఎక్కడా ఏ కార్యాలయంలో లేని విధంగా కేఎంసీలో 23 మంది వరకు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించగా పలువురికి కనీస కంప్యూటర్ పరిజ్ఞానం లేదని తెలుస్తోంది. అయినా రాజకీయ పలుకుబడితో ఇతర విధుల్లో చేరి కంప్యూటర్ ఆపరేటర్లుగా పేర్లు నమోదు చేయించుకున్నారని సమాచారం. కాస్త పరిజ్ఞానం ఉన్న వారు అధికారులను ఏమారుస్తుంటే.. ఏ మాత్రం నైపుణ్యం లేని సిబ్బంది ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి నెట్టుకొస్తున్నారని తెలుస్తోంది. ఇంతమంది ఉన్నప్పటికీ ప్రత్యేక అవసరాల సమయాల్లో మాత్రం రోజువారీ వేతనంపై బయట నుంచి ఆపరేటర్లను తీసుకొస్తుండడం గమనార్హం.

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

- డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్
- ఖమ్మం, మధిర స్టేషన్లలో పనుల పరిశీలన



ఖమ్మం స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్, అధికారులు

ఖమ్మం రాపర్తినగర్/మధిర: రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్‌ఎం) భర్తేష్‌కుమార్ జైన్ హెచ్చరించారు. జిల్లాలోని ఖమ్మం, మధిర రైల్వేస్టేషన్లలో అమృత్ భారత్ కింద మంజూరైన నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ఎక్కడైనా నాణ్యత తగ్గినట్లు తన దృష్టికి వస్తే బాధ్యులపై చర్యలు తప్పవని తెలిపారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తిచేయాలని చెప్పారు. ఖమ్మంలో విశ్రాంతి గదులు, ఫ్లాట్‌ఫాంపై జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అమృత్ భారత్ కింద రూ.25కోట్ల చొప్పున నిధులతో ఖమ్మం, మధిర స్టేషన్లలో చేపడుతున్న పనులు పూర్తయితే కొత్త కళ వస్తుందని చెప్పారు. ఇదేసమయాన టికెట్ బుకింగ్ కౌంటర్ల వద్దకు వెళ్లిన ఆయన ప్రయాణికులతో మాట్లాడి వివరాలు ఆరాతీశారు. ఈ తనిఖీల్లో ఏడీఎం ఎం.గోపాల్‌నాయక్, అధికారులు గట్టి శక్తి సుబ్రమణ్యం, జాఫర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మధిర స్టేషన్‌లో డీఆర్‌ఎంను బీజేపీ నాయకులు ఏలూరు నాగేశ్వరరావు, చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు కలిసి నవజీవన్, లక్నో ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇవ్వాలని, పాత రైల్వే గేట్ స్థానంలో అండర్ పాస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు.

గిరిజనాభివృద్ధికి కృషి చేస్తా

- విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తా
- ఐటీడీఏ నూతన పీఓ రాహుల్



భద్రాచలం : ఏజెన్సీ ప్రాంత గిరిజనుల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వెల్లడించారు. మంగళవారం ఆయన పీఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేకంగా ఏజెన్సీ ఏరియాలో పని చేయాలనే తపనతోనే భద్రాచలం వచ్చానని చెప్పారు. మంచిర్యాలలో పనిచేసిన సమయంలో ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో కొన్ని గ్రామాల్లో పరిపాలనా అనుభవం ఉందని తెలిపారు. గిరిజనులకు విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, గతంలో పనిచేసిన చోట విద్యా రంగంలో కీలక మార్పులకు ప్రణాళిక అమలు చేశానని వివరించారు. ఆ అనుభవంతో గిరిజన విద్యార్థులకు మెరుగైన బోధన అందించి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూస్తానని తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యారంగ బలోపేతానికి దిశానిర్దేశం చేస్తానని అన్నారు. అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ పెంచి, గిరిజనులకు ఆర్థిక స్వావలంబన చేకూరేలా జీసీసీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ట్రైనీ ఐఏఎస్‌గా ఉన్నప్పుడు భద్రాచలంలో వారం రోజులు, ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన తనకు ఈ ప్రాంతంతో అనుబంధం ఉందని గుర్తు చేశారు.

కొనసాగుతున్న ‘భగీరథ’ సర్వే

- జిల్లాలో 2,13,883 ఇళ్లలో పూర్తి
- 79 శాతం దాటిన వివరాల సేకరణ



మిషన్ భగీరథ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: రాష్ట్రప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా తీరుతెన్నులపై చేపట్టిన సర్వే జిల్లాలో వేగంగా కొనసాగుతోంది. జిల్లాలోని 3.20 లక్షల గృహాలకు గాను 11వ తేదీ నుంచి ఇప్పటివరకు 2,13,883 గృహాల్లో సర్వే పూర్తి చేశారు. తద్వారా 70 శాతం పూర్తి కావడంతో ఇళ్ల వారీగా నల్లా కనెక్షన్లు, సరఫరా, వినియోగం తదితర అంశాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. కాగా, మిషన్ భగీరథ పథకం ప్రారంభమైన తొలినాళ్లలో సర్వే చేశారు. ఆ జాబితా ఆధారంగా ఇప్పుడూ సర్వే కొనసాగిస్తున్నారు. మిషన్ భగీరథతో పాటు పాత నల్లా కనెక్షన్లు ఉన్నా యాప్‌లో నమోదు చేస్తున్నారు. అయితే, సర్వేకు వెళ్తున్న సిబ్బందికి పలువురు కొత్త ఇళ్ల యజమానులు నల్లా కనెక్షన్ ఇవ్వాలని కోరుతుండడంతో పాటు కొన్ని గ్రామాల్లో కుటుంబానికి సరిపడా నీరు రావటం లేదని చెబుతున్నట్లు సమాచారం. దీంతో మొత్తం కుటుంబ సభ్యులు, ఎంత సేపు నీరు వస్తోంది, ఎంత మేర సరిపోతుందనే వివరాలను కూడా సిబ్బంది సేకరిస్తున్నారు.

సమగ్ర ప్రణాళికకు అవకాశం

జిల్లావ్యాప్తంగా మరో వారం రోజుల్లో సర్వే పూర్తయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఆతర్వాత నివేదిక ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా వాస్తవ పరిస్థితులు వెల్లడి కానున్నాయి. దీంతో అదనంగా ఎంత మేర నీరు సరఫరా చేయాలి, ఎన్ని గృహాలు, కాలనీలకు కొత్త కనెక్షన్లు ఇవ్వాలి, కొత్తగా ఎంత మేర పైపులైన్ వేయాలనే వివరాలు తెలిస్తే ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించే అవకాశముంది. ఈవిషయమై మిషన్ భగీ రథ ఈఈ పుష్పలత మాట్లాడుతూ కొన్ని ఆవాసాల్లో సర్వే చివరి దశకు చేరిందని, మొత్తంగా వారంలోపు పూర్తి చేస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు.

సాగు భూములకే రైతు భరోసా ఇవ్వండి..

- మెజార్టీ రైతుల అభిప్రాయం
- ‘రైతు నేస్తం’లో భాగంగా అభిప్రాయ సేకరణ



కూసుమంచి నుంచి వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు, రైతులు

రఘునాథపాలెం/కల్లూరు/కూసుమంచి: పంటలను సాగు చేస్తున్న భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని మెజార్టీ రైతులు కోరారు. ప్రతీ మంగళవారం ఎంపిక చేసిన రైతువేదికల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఈ వారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వివిధ విభాగాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం పంపిణీ అభిప్రాయ సేకరణ చేపట్టగా జిల్లాలోని రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం, కల్లూరు, కూసుమంచి నుంచి హాజరైన రైతులు మాట్లాడారు. గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన భూములకు కాకుండా సాగు చేస్తున్న భూములకే రైతు భరోసా ఇవ్వాలని ఎక్కువ మంది రైతులు సూచించగా, ఇంకొందరు పది ఎకరాలకే పరిమితి విధించాలని కోరారు. అనంతరం శాస్త్రవేత్తలు మల్లారెడ్డి తదితరులు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, వ్యవసాయ శాఖ అధికారులు సరిత, శ్రీనివాసరావు, యు.నరసింహారావు, విజయచంద్ర, ఎం.రూప, వాణి, సీతారాంరెడ్డి, అరుణకుమారి, నాగేశ్వరరావుతో పాటు పీఏసీఎస్‌ల అధ్యక్షులు, నాయకులు రావూరి సైదుబాబు, తాత రఘురాం, యరగర్ల హన్మంతరావు, కళింగరెడ్డి, రావెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ పనులతో రహదారి మూత

జిల్లా కేంద్రంలో మొదలవుతున్న మూడో లైన్ నిర్మాణం

ఖమ్మంగాంధీచౌక్: కాజీపేట–విజయవాడ మార్గంలో చేపడుతున్న మూడో రైల్వే లైన్ పనులు జిల్లా కేంద్రంలో మొదలయ్యాయి. నగరంలోని చర్చి కాంపౌండ్ – ప్రకాష్‌నగర్ మార్గంలో ఉన్న రైల్వే వంతెన నుంచి గాంధీచౌక్, కమాన్‌బజార్ వైపు మధ్య గేట్ వరకు, వంతెన కింద నుంచి ఇప్పటికే లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఆపై వంతెన కింద నుంచి నర్తకి టాకీస్, ఐరన్ దుకాణాలు, మధ్య గేట్ వరకు ఉన్న మోహన్ రోడ్డుపై రైల్వే లైన్ నిర్మాణ పనులకు ఏర్పాట్లు జరుగుతుండగా... సగం మేర బారికేడ్లు పాతారు. ఫలితంగా శ్రీనివాస నగర్, గుట్టల బజార్, ప్రకాష్‌నగర్, గాంధీచౌక్, గాంధీనగర్, త్రీటౌన్ తదితర ప్రాంతాల వారే కాక ముదిగొండ, చింతకాని, బోనకల్, నేలకొండపల్లి మండలాల నుంచి వచ్చే ప్రజలు, టూటౌన్, వన్‌టౌన్ వాసులు గాంధీచౌక్‌కు వెళ్లాలంటే ఇక్కట్లు ఎదురుకానున్నాయి. ఇక రైల్వేలైన్ నిర్మాణం కారణంగా ఈ మార్గంలో ఉన్న పలు వ్యాపార సంస్థలను తొలగించాల్సి వస్తుండగా, కొందరు యజమానులు సంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించారు. కాగా, ఇక్కడి నివాసాలకు అనుగుణంగా రైల్వే లైన్ పూర్తయ్యాక మరో రహదారి నిర్మించే అవకాశం ఉంది.

మధ్య గేట్ కూడా మూత

ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్ నుంచి త్రీ టౌన్‌కు అనుసంధానంగా కమాన్‌బజార్, గాంధీచౌక్ నడుమ ఉన్న మధ్య గేట్ మీదుగా మూడో రైల్వే లైన్ పనులు సైతం త్వరలో మొదలుకానున్నాయి. దీంతో ఇక్కడి గేట్‌ను



రైల్వే లైన్ నిర్మాణానికి ఖమ్మం త్రీటౌన్ మోహన్ రోడ్డుపై పాతిన కర్రలు

మూసేసి క్యాబిన్‌ను తొలగించి ఖమ్మం రైల్వేస్టేషన్ గుండా లైన్ నిర్మించనున్నారు. మధ్యగేట్ వద్ద మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులు మొదలైతే త్రీటౌన్‌లోని గాంధీచౌక్–కమాన్‌బజార్, కస్బాబజార్‌కు మధ్య సంబంధాలు తెగిపోనున్నాయి. ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే మయూరిసెంటర్ మీదుగా లేదంటే వెంకటగిరి గేటు వంతెన మీదుగా వెళ్లాల్సి వస్తుంది.

క్లుప్తంగా

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత

కూసుమంచి: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఆదేశించారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన ధరణి దరఖాస్తులు, పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలపై తహసీల్దార్ సురేష్‌కుమార్‌తో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో విచారించడమే కాక రికార్డులను పరిశీలిస్తూ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ సూచించారు.

'ఎమర్జెన్సీ రోజులను భారత జాతి క్షమించదు..'


జైలు జీవితం గడిపిన వారిని సన్మానిస్తున్న శ్రీధర్‌రెడ్డి, నాయకులు

ఖమ్మంరూరల్: ఎన్నేళ్లుగా గడిచినా ప్రధానిగా ఇందిరాగాంధీ ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ చీకటి రోజులు, వాటి పర్యవసానాలను ప్రజలు క్షమించరని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బీజేపీ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆగంగా ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో ప్రజాస్వామిక, జాతీయవాదులు జైళ్ల పాలయ్యారని తెలిపారు. ఈసందర్భంగా ఎమర్జెన్సీ సమయాన కేసులు పాలై జైలు జీవితం గడిపిన దుద్దుకూరి వెంకటేశ్వరరావు, నామవరపు శ్రీనివాసశర్మ, శంకరం బాబును శ్రీధర్‌రెడ్డి సన్మానించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేందర్‌రావు, ఎం.సంతోష్‌రెడ్డి, మల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, కొమరాబత్తిని. వెంకన్న, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన డీసీసీబీ డీజీఎంలు, ఏజీఎంలు

ఖమ్మంవ్యవసాయం: కామన్ పూల్ విధానంలో సొంత జిల్లాకు బదిలీ అయిన సహకార బ్యాంక్ అధికారులు మంగళవారం ఖమ్మంలోని డీసీసీబీ కార్యాలయంలో విధుల్లో చేరారు. అలాగే, ఇక్కడి డీసీసీబీ నుంచి పలువురు అధికారులు రిలీవ్ అయి తమ సొంత జిల్లాలకు వెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా డీసీసీబీల్లో విధులు నిర్వర్తిస్తున్న వివిధ స్థాయి అధికారులు 68 మందిని బదిలీ చేస్తూ టస్కాబ్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఖమ్మం డీసీసీబీకి కేటాయించిన డిప్యూటీ జనరల్ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు జి.ఉదయశ్రీ, జి.వేణుగోపాల్, ఎం.సర్వేశ్వర్‌రావు, బి.చందర్‌రావు, జి.ప్రవీణ్, కె.రాధిక, ఎ.కల్యాణి, కె.నవీన్ మంగళవారం రిపోర్ట్ చేయడంతో వారికి సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ సెక్షన్లు అప్పగించారు. ఇక ఖమ్మం డీసీసీబీలో పనిచేస్తున్న ఎస్.కిరణ్‌కుమార్, రాగినేని ఉపేందర్‌రావు, టి.అజయ్‌రెడ్డి, మధు సంది, గంప స్రవంతి, బి.కృష్ణమోహన్, పి.వెంకటేశ్వర్లును సొంత జిల్లాలకు బదిలీ చేయగా వారు రిలీవ్ అయ్యారు. అయితే, జనరల్ మేనేజర్లను కూడా త్వరలోనే కామన్ పూల్ విధానంలో బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇది అమలైతే ఖమ్మం జీఎంగా కొనసాగుతున్న కాకర్ల నర్మద నల్లగొండకు వెళ్లనుండగా, నల్లగొండలో పనిచేస్తున్న వసంతరావు ఖమ్మం వస్తారు.

మనీ సర్క్యులేషన్‌పై క్షేత్రస్థాయిలో ఆరా

నేలకొండపల్లి: మనీ సర్క్యులేషన్ సిస్టమ్ నిర్వాహకుడు, మండలంలోని మంగాపురం తండాకు చెందిన వీరన్నను రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్న పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించారు. వీరన్న సహా పలువురు ఏర్పాటుచేసిన సంస్థ ద్వారా వేలాది మంది ప్రజల నుంచి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఆయన ఫోన్‌లోని నంబర్ల ఆధారంగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఏజెంట్లు ఎందరు, ఎవరెవరు పెట్టుబడి పెట్టారనే అంశంపై దృష్టి సారించారు. అయితే, బాధితులు వేలల్లో ఉన్నా కేవలం ఒక్కరే పోలీసులను ఆశ్రయించారు. కాగా, నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి, సూర్యాపేట జిల్లాలోని పలు మండలాలకు చెందిన వారు ఏజెంట్లుగా ఉన్నట్లు తెలుస్తుండగా అందరి వివరాలు సేకరిస్తున్నారు. అయితే, ఈ విషయమై వివరాలు ఆరా తీసేందుకు యత్నించగా పోలీసులు స్పందించలేదు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,200	1,900
పెసలు	7,712	5,000
మిర్చి	19,200	9,000
మిర్చి తాలు	10,200	7,500
ఏసీ మిర్చి	20,000	10,000
ఏసీ తాలు	10,500	9,200
పత్తి	7,100	5,700

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,438

మత్తులో.. చిత్తు కావొద్దు

- జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు, వాడకం
- బానిసలుగా మారుతున్న విద్యార్థులు?
- మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం
- నిర్మూలనలో తల్లిదండ్రుల పాత్రే కీలకమంటున్న నిపుణులు

నేడు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం



ఖమ్మంవన్‌టౌన్: దేశాభివృద్ధిలో కీలకమైన యువత మాదకద్రవ్యాల బారిన పడుతోంది. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు ఎక్కడ పడితే అక్కడ లభిస్తుండడంతో పదిహేనేళ్ల లోపు పిల్లలు మొదలు యువత వరకు పలువురు మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని తెలుస్తోంది. మత్తు పదార్థాలు వివిధ రూపాల్లో లభిస్తుండడంతో ధూమపానం, మద్యపానం వంటివి క్రమంగా జీవితంలో భాగమై పలువురు విచక్షణ మరిచి నేరాలకు పాల్పడుతున్నారు. అంతేకాక ఈ అలవాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలపైనా ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు మెట్రోపాలిటన్ నగరాలు, పట్టణాలకే పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడు మారుమూల పల్లెలకు సైతం పాకింది. ఈనేపథ్యాన నేడు(బుధవారం) అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించేందుకు వివిధ శాఖల అధికారులు సిద్ధమవుతున్నారు.

విద్యాసంస్థలే లక్ష్యంగా దందా

యువతే టార్గెట్‌గా ఉమ్మడి జిల్లాలో గంజాయి వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. కౌమారదశలో ఉన్న విద్యార్థులు మంచి, చెడు గుర్తించలేక త్వరగా అలవాటయ్యే అవకాశముండడంతో సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న వ్యాపారుల కన్ను వారిపై పడింది. విచ్చలవిడిగా మద్యం షాపులకు అనుమతించడం, ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో ఇన్నాళ్లు పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో మాదకద్రవ్యాల అమ్మకం, వాడకం పెరిగింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడో ఓ చోట ప్రతిరోజు గంజాయి పట్టుబడుతుండడం.. ప్రతీ పాన్‌షాపు, కిరాణ షాపుల్లోనూ లభిస్తున్నట్లు తెలుస్తుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

సరదాగా మొదలు.. ఆపై వ్యసనం

యుక్తవయస్సు పిల్లల్లో విపరీతమైన ఉత్సాహం ఉంటుంది. సాహసాలు చేయాలని మనసు ఆరాట పడుతుంటుంది. దీంతో ఇలాంటి వారిని మత్తు పదార్థాలు ఆకర్షించే అవకాశముంది. ధూమపానం, మద్యపానం ఇతర మత్తుపదార్థాలు తొలినాళ్లలో సరదాగా అలవాటవుతున్నా ఆ తర్వాత వ్యసనంలా మారి జీవితాలను నాశనం చేస్తున్నాయి. గంజాయిలో ఉండే టెట్రా హైడ్రోకెనబినాయిడ్(టీహెచ్‌సీ) రసాయనం వ్యక్తులను దానికి బానిసలుగా మారుస్తుంది. అది మెదడుపై తీవ్రమైన ప్రభావం చూపి శ్రద్ధ, ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని దెబ్బతీయడమే కాక చురుకుదనాన్ని తగ్గిస్తుంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించిన తర్వాత వ్యక్తుల్లో భ్రమలు మొదలై నేరప్రవృత్తి పెరగడంతో పాటు ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు సైతం వస్తుంటాయి. దీంతో తమను తాము గాయపర్చుకోవడమే కాక దాడులు, హత్యలు, దొంగతనాల వంటి నేరాలకు ఒడిగట్టే ప్రమాదముంది.

తల్లిదండ్రులు గమనించాలి...

పిల్లలు, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అడ్డుకోవడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు చిన్నచిన్న విషయాలకు అతిగా స్పందించడం లేదంటే మౌనంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే అనుమానించాల్సిందేనని చెబుతున్నారు. ఇలాంటి వారిని నిత్యం పర్యవేక్షిస్తూ వారి గదులు, బ్యాగులను తనిఖీ చేయాలని సూచిస్తున్నారు. అంతేకాక ఎవరెవరితో తిరుగుతున్నారో పరిశీలిస్తే అవసరానికి మించి డబ్బు ఇవ్వకుండా అడ్డుకట్ట వేయాలని చెబుతున్నారు.

మెదడుపై తీవ్ర ప్రభావం...



మత్తుపదార్థాల వాడకం సరదాగా ప్రారంభమైనా వ్యసనంగా మారి జీవితాన్ని నాశనం చేస్తుంది. మత్తుపదార్థాలు తీసుకున్న వారి మెదడులో డోపమైన్, సెరటోనిన్ అనే ఉత్ప్రేరకాలు విడుదలవుతాయి. తద్వారా శరీరం ఉత్తేజంగా ఉన్నట్లు అనిపించి.. కాసేపటికి మళ్లీమళ్లీ తీసుకోవాలనిపిస్తుంది. క్రమంగా తీవ్రమైన మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆదిలోనే అడ్డుకట్ట వేయాలి.

– డాక్టర్ అప్పారావు ఎండీ, డీఎం (న్యూరాలజీ)

అందరూ భాగస్వాములు కావాలి : సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: మాదకద్రవ్యాల వినియోగం, రవాణాకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో బుధవారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నివర్గాల ప్రజలు యాంటీ డ్రగ్స్ కమిటీల్లో సభ్యులుగా చేరాలని కోరారు. ఈమేరకు వారం పాటు మాదకద్రవ్యాల వినియోగం, దుష్పలితాలపై విద్యాసంస్థల్లో అవగాహన కల్పించడమే కాక ర్యాలీలు నిర్వహించనున్నట్లు సీపీ తెలిపారు. అలాగే, ఐసీడీఎస్, పోలీస్ శాఖలోని యాంటీ నార్కోటిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యాన బుధవారం ఉదయం 7గంటలకు సర్దార్ పటేల్ స్టేడియం నుండి లకారం ట్యాంక్ బండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం


ర్యాలీలో పాల్గొన్న తమ్మినేని వీరభద్రం, సీపీఎం నాయకులు

- నీట్‌పై కేంద్రం స్పందించకపోవడం సిగ్గుచేటు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

కొణిజర్ల: కేంద్రప్రభుత్వం బొగ్గు గనుల వేలం ద్వారా ప్రైవేటీకరణకు చేస్తున్న ప్రయత్నాలను ఇండియా కూటమి ఆధ్వర్యాన అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. కొణిజర్ల మండలం చిన్నగోపతిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న రాజకీయ శిక్షణా తరగతులను ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని బొగ్గు గనులను సింగరేణికి అప్పగించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాడాలన్నారు. అలాగే, ఏపీ – తెలంగాణ విభజన సమయంలో బయ్యారంలో ఉక్కు కర్మాగారం, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటుపై ఇచ్చిన హామీలను కేంద్రం అమలచేయాలని డిమాండ్ చేశారు. కాగా, నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై కేంద్రం నోరు మెదపక పోవడం సిగ్గుచేటని, ఇకనైనా అవినీతికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించి విద్యార్థులకు భరోసా కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల సమయాన ఇచ్చిన ఆరు గ్యారంటీలను బేషరతుగా అమలు చేయాలన్నారు. రైతుబంధు, రుణమాఫీ రెండూ ఏకకాలంలో వర్తింపచేయడమే కాక వ్యవసాయ కార్మికులకు అమలు చేసిన కనీస వేతన చట్టాన్ని తీసుకురావాలని సూచించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించగా సీపీఎం సీనియర్ సీపీఎం నాయకుడు కొప్పుల కృష్ణయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు పోతినేని సుదర్శన్, పిట్టల రవి, భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ, చెరుకుమల్లి కుటుంబరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, చింతపల్లి ప్రసాద్, మోత్కూరి వెంకయ్య, లింగాల దానయ్య,దారగాని రాములు, మాధవరెడ్డి, వీరభద్రం, మహబూబ్ అలీ, మోహనరావు, రవి, విజయ, కుమారి, సరోజిని, అఫ్జల్, సాంబ పాల్గొన్నారు.

బైక్ - ఆర్టీసీ బస్సు ఢీ

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా వద్ద మంగళవారం ద్విచక్ర వాహనదారుడు ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన రాధాకృష్ణ పెదతండా వైపు నుండి ఇంటికి వెళ్తూ వెనక నుండి బస్సును ఢీకొట్టాడు. ఈఘటనలో ఆయన కుడికాలు నుజ్జునుజ్జయింది. దీంతో చికిత్స నిమిత్తం 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

కార్లలో వచ్చి పేకాట...

ఆరుగురు అరెస్ట్,
రూ.12,360 నగదు స్వాధీనం

కారేపల్లి: పక్కాగా అందిన సమాచారంతో పేకాట స్థావరంపై ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టగా ఆరుగురు పట్టుబడ్డారు. కారేపల్లి మండలం గేటుకారేపల్లి శివారులో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. గేటుకారేపల్లి శివార్లలోని ఓ షెడ్డులో కొందరు ఖమ్మం నుంచి కార్లలో వచ్చి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఖమ్మం టాస్క్‌ఫోర్స్, కారేపల్లి పోలీసులు మాటు వేసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు మూడు కార్లు, రూ.12,360 నగదు స్వాధీనంచేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

వందనం గ్రామంలో...

చింతకాని: మండలంలోని వందనంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.3,300 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

కల్లూరు సమీపాన...

కల్లూరు రూరల్: కల్లూరు సమీపంలోని మారుతి నగర్‌లో పేకాట స్థావరంపై ఎస్ఐ షాకీర్ ఆధ్వర్యాన మంగళవారం రాత్రి దాడులు చేశారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.1,860 నగదు స్వాధీనం చేసుకున్నారు.

చదువుల మోత..


బుక్‌స్టాల్ వద్ద సందడిగా...

విద్యాసంవత్సరం ప్రారంభమైంది. ఇప్పుడిప్పుడే పాఠశాలల్లో బోధన ఊపందుకుంటోంది. ఈనేపథ్యాన విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, హాస్టళ్లకు వెళ్తున్న వారి కోసం పరుపులు, పెట్టెలు ఇతర సామగ్రి కొనుగోళ్లలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. దీంతో జిల్లా కేంద్రంలోని బుక్‌స్టాళ్లు, ఇతర దుకాణాలు వారం ఇలా రద్దీగా కనిపించాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


పెట్టెలు, పరుపులు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు


ఖమ్మంలో ఓ బుక్‌స్టాల్ వద్ద కిటకిటలాడుతున్న జనం


నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు

155 పోస్టులు.. 5,200 దరఖాస్తులు


దరఖాస్తు చేసేందుకు తరలివచ్చిన అభ్యర్థులు

- నిరుద్యోగ సమస్యకు అద్దం పట్టిన వైనం
- కిక్కిరిసిన కొత్తగూడెం కలెక్టరేట్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోని 23 విభాగాల్లో 155 ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి జిల్లా ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి మంగళవారం వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఈనేపథ్యాన 5,200 మంది దరఖాస్తు చేసుకోగా చివరి రోజైన మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన వారిని చూస్తే నిరుద్యోగ సమస్య తీవ్రత బయటపడింది. అభ్యర్థులతో దరఖాస్తు స్వీకరణ హాల్ కిక్కిరిసిపోయింది. ఇక దరఖాస్తులకు జతచేసే సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించాలనే నిబంధనతో పలువురు ఇబ్బందులకు గురయ్యారు. సంతకం చేయాలంటే ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలని గెజిటెడ్ అధికారులు చెప్పడంతో అవి అందుబాటులో లేక తిప్పలుపడ్డారు. ఒకరు ఒక పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేయాలని అధికారులు సూచించడంతో తొలుత అభ్యర్థులు నిరసన వ్యక్తం చేసినా.. చివరకు అలాగే సమర్పించారు.

రైతు సమస్యలపై దశల వారీ ఉద్యమం

జాతీయ కిసాన్ మోర్చా నిర్ణయం

ఖమ్మంవ్యవసాయం: రైతు సమస్యల పరిష్కారానికి మరో ఉద్యమం చేపట్టాలని రాజకీయేతర జాతీయ సంయుక్త కిసాన్ మోర్చా నడుం బిగించింది. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను అవలంభిస్తోందని పేర్కొంటూ కిసాన్ మోర్చా చీఫ్–కోఆర్డినేటర్ జగ్జిత్‌సింగ్ దలేవాల్ నేతృత్వాన జాతీయ నాయకుల బృందం దక్షిణాది రాష్ట్రాల పర్యటనలో భాగంగా కర్ణాటకలోని శివమొగ పట్టణంలో మంగళవారం సమావేశమైంది. ఈ సమావేశంలో ఖమ్మంకు చెందిన రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రైతు సమస్యలపై 2022లో ఢిల్లీలో సుదీర్ఘకాలం పాటు నిర్వహించిన ఉద్యమం మాదిరి మరోమారు ఉద్యమానికి సిద్ధమవుతుండగా.. అందరి మద్దతు కోసం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అంశంపై జూలై 8న బీజేపీయేతర పార్టీలకు చెందిన 303 మంది ఎంపీలకు వినతిపత్రాలను ఇవ్వడమే కాక పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందుగా ఢిల్లీలో 10 వేల మందితో రైతు సదస్సు నిర్వహించాలని, హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి ప్రచార యాత్రలు చేపట్టాలని నిర్ణయించినటువెల్లడించారు.

గుండెపోటుతో ఏరోనాటికల్ ఇంజనీర్ మృతి

బెంగళూరులో కన్నుమూసిన పిండిప్రోలు వాసి


కృష్ణమూర్తి (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన ఊడుగుల కృష్ణమూర్తి(44) బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ కంపెనీలో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా గుండెపోటుతో మృతి చెందారు. పిండిప్రోలుకు చెందిన ఊడుగుల వెంకయ్య – మాణిక్యమ్మ మూడో కుమారుడు కృష్ణమూర్తి ఇరవై ఏళ్ల క్రితం బెంగళూరులోని హెచ్ఏఎల్‌లో ఇంజనీర్‌గా చేరి డిప్యూటీ మేనేజర్ స్థాయికి ఎదిగాడు. ఇటీవలే సొంత గ్రామంలో జరిగిన గ్రామ దేవత వేడుకకు కూడా హాజరయ్యాడు. ఈనెల 22న బెంగళూరులోని నివాసంలో బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆయన అక్కడే గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందినట్లు తెలిసింది. ఆ సమయాన భార్య శిరీష, పిల్లలు ఖమ్మంలో ఉండడంతో కృష్ణమూర్తి మృతి విషయం రెండు రోజుల తర్వాత స్నేహితుల ద్వారా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆయన బంధువులు మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు బెంగళూరు వెళ్లారు. కాగా, కృష్ణమూర్తి విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కల్వర్టును ఢీకొని ఆటో బోల్తా..

16 మంది కూలీలకు గాయాలు


కొత్తగూడెంరూరల్: బోల్తా పడిన ప్రాంతంలో క్షతగాత్రులు

కొత్తగూడెంరూరల్: కూలీలతో వస్తున్న ఆటో లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామ సమీపాన కల్వర్టు ఢీకొని బోల్తా పడడంతో 16 మందికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని చింతపెంటగూడెం, బంగారుచెలక గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు 16 మంది గట్టుమల్ల ప్రాంతంలో మొక్కజొన్న గింజలు వేయడానికి ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మైలారం గ్రామ సమీపాన ఉన్న కల్వర్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బొర్రా వీరబాబు, కోరం పార్వతి, చింత సుజాత, మలకం ఉమలకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన 12 మందికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు క్షతగ్రాతులను జిల్లా కాంగ్రెస్ నాయకుడు తూము చౌదరి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాలు సందర్శించి పరామర్శించారు. కాగా, ఆటోలో ఎక్కువ మందిని ఎక్కించడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తుంది. ఈ విషయమై లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

పెద్దవాగు బ్రిడ్జి వద్ద మరో ఆటో..

బూర్గంపాడు: సారపాక–నాగినేనిప్రోలు మధ్యన పెద్దవాగు బ్రిడ్జి సమీపాన మంగళవారం కూరగాయలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్‌కు, ఓ ప్రయాణికురాలికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆటోను బయటకు తీయించారు.

గంటల వ్యవధిలోనే తల్లీ కుమారుడు...

కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన ఇద్దరు

ముదిగొండ: గడ్డిమందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన రఘునాధపాలెం మండలం చిమ్మపూడికి చెందిన కణతల శేషగిరి(36) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. కుటుంబ, ఆర్థిక సమస్యల కారణంగా చిమ్మపూడికి చెందిన తల్లీ,కుమారుడు కణతాల నర్సమ్మ(55), శేషగిరి(36) ముదిగొండ మండలం సువర్ణాపురం శివారులో ఈనెల 23న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. వీరిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, సోమవారం ఉదయం నర్సమ్మ మృతి చెందింది. అలాగే, ఆమె కుమారుడు శేషగిరి అర్ధరాత్రి దాటాక మృతి చెందగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదిగొండ ఎస్ఐ గజ్జెల నరేష్ తెలిపారు. కాగా, గంటల వ్యవధిలోనే తల్లీకుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

మధిరరూరల్: మండలంలోని రాయపట్నం సమీపాన సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన కంచేటి అబ్బయ్య(42) మృతి చెందాడు. ఆయన మధిర నుంచి ఇంటికి నడిచి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ తన అంబులెన్స్‌లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజల గొంతును గుర్తించండి

స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ

ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించేందుకు వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలి

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ప్రతిపక్ష హోదా ఉండాల్సిందేనని, ఈ విషయంలో పరిశీలన చేయాలని కోరుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుందన్నారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు సాధించాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. విపక్ష పార్టీల్లో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని పేర్కొన్నారు. శాసనసభలో కూటమి పార్టీల ఉద్దేశపూర్వక చర్యలను సైతం లేఖలో ప్రస్తావించారు. వైఎస్ జగన్ లేఖలో ముఖ్యాంశాలు ఇవీ..

శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు..

మంత్రుల తర్వాత నాతో ప్రమాణం చేయించడం సంప్రదాయాలకు పూర్తి విరుద్ధం. ప్రధాన ప్రతిపక్ష నాయకుడి గుర్తింపు ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించినట్లు దీనిద్వారా కనిపిస్తోంది. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే పది శాతం సీట్లు సాధించి ఉండాలని చట్టంలో ఎక్కడా లేదు. పార్లమెంట్‌లోగానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ ఈ నిబంధన పాటించలేదు. అధికార కూటమి, స్పీకర్ ఇప్పటికే నాపట్ల శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ చేసిన వ్యాఖ్యలు వీడియోల ద్వారా బయటపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో అసెంబ్లీలో గొంతు విప్పే అవకాశాలు కనిపించడం లేదు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతోనే ప్రజా సమస్యలను బలంగా వినిపించే ఆస్కారం ఉంటుంది. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని నా లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

అంతరంగం అప్పుడే అర్థమైంది..

ఈనెల 21న అసెంబ్లీలో జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణం కార్యక్రమాన్ని పరిశీలిస్తే నాకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వరనే అభిప్రాయం కలిగింది. అసెంబ్లీ సంప్రదాయాల ప్రకారం ముందుగా సభా నాయకుడు, తర్వాత ప్రతిపక్ష నాయకుడు, అనంతరం మంత్రులు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా అలా జరగలేదు. సంప్రదాయాలకు విరుద్ధంగా మంత్రుల తర్వాతే నాతో ప్రమాణం చేయించారు. నాకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకూడదనే నిర్ణయాన్ని మీరు ముందుగానే తీసుకున్నట్లు కనిపిస్తోంది.

చట్టంలో స్పష్టంగా ఉంది..

ప్రధాన ప్రతిపక్ష పార్టీ, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అంటే ఎవరనే విషయాన్ని చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్క్వాలిఫికేషన్ యాక్ట్ 1953 చట్టం 12 ఆ' ప్రధాన ప్రతిపక్ష పార్టీ అంటే ఎవరనే విషయాన్ని స్పష్టంగా నిర్వచించింది. విపక్షంలో ఉన్న పార్టీల్లో ఎవరికి ఎక్కువ సంఖ్యా బలం ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టం చెబుతుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకుని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందున విపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. కానీ జూన్ 21న జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చూస్తే వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం, పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా నన్ను ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించడంలో మీ ఉద్దేశాలేమిటో బయటపడ్డాయి. కానీ చట్టాన్ని పరిశీలిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడంలోగానీ, పార్టీ శాసనసభా పక్షనేత అయిన నన్ను ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించేందుకుగానీ ఎలాంటి సందిగ్ధతకు తావులేదు. ఇటీవల స్పీకర్ చేసిన వ్యాఖ్యలు యూట్యూబ్ ఛానళ్లలో ఉన్నాయి. ఓడిపోయాడుగానీ చావలేదు.. చచ్చేవరకూ కొట్టాలి..! అంటూ నన్ను ఉద్దేశించి గౌరవ స్పీకర్ అన్న మాటలు ఆ వీడియోల్లో ఉన్నాయి. తద్వారా నాపై ఉన్న శత్రుత్వాన్ని స్పీకర్ రూపంలో అధికార కూటమి వ్యక్తం చేసింది.

వైఎస్సార్ సీపీ 40 శాతం ఓట్లను సాధించింది..

ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 40 శాతం ఓట్లను సాధించింది. ప్రజా సంబంధిత అంశాలపై అసెంబ్లీలో ప్రజల తరపున ప్రాతినిధ్యం వహించాల్సిన బాధ్యత మాపై ఉంది. అయితే ప్రభుత్వం, స్పీకర్ శత్రుత్వ వైఖరిని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో మా పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీ కార్యకలాపాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కట్టడి చేస్తున్నట్లే అవుతుంది. వైఎస్సార్ సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం వల్ల అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడికి తగిన సమయం లభిస్తుంది. దీనివల్ల ప్రజా సంబంధిత అంశాలను సభ దృష్టికి బలంగా తేగలుగుతారు. సభా కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొనేలా, ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్ష పార్టీగా అభిప్రాయాలను చెప్పేలా చట్టబద్ధమైన భాగస్వామ్యం ప్రధాన ప్రతిపక్ష పార్టీకి లభిస్తుంది. ఇలాంటి పరిస్థితి లేకపోతే అసెంబ్లీలో అధికార కూటమి గొంతు మాత్రమే వినిపిస్తుంది. వివిధ అంశాల్లో బలమైన చర్చలు జరిగే అవకాశం కనిపించదు.

అసెంబ్లీలో 10 శాతం సీట్లు రానందున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్షానికి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించదనే చర్చ జరుగుతోంది. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 208 కింద ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నోటిఫై చేసిన సభా ప్రవర్తనా నియమావళిలో నిర్దిష్ట సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలనే విషయాన్ని ఎక్కడా చెప్పలేదనే విషయాన్ని మీ ముందుకు తెస్తున్నా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎక్కడా ఈ నిబంధన పాటించలేదనే అంశాన్ని గుర్తు చేస్తున్నా. లోక్‌సభకు 1984లో 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 30 ఎంపీ సీట్లను గెలుచుకుంది. సభలో 10 శాతం సీట్లు సాధించనప్పటికీ నాడు టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రను ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు. 1994 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకుగానూ కాంగ్రెస్ 26 సీట్లు మాత్రమే సాధించింది. 10 శాతం సీట్లు కాంగ్రెస్‌కు దక్కనప్పటికీ పి.జనార్దన్‌రెడ్డిని నాడు ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు.

ఉపేంద్ర, పీజేఆర్‌ను ప్రధాన ప్రతిపక్ష నేతలుగా గుర్తించారు..

2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగానూ బీజేపీ కేవలం 3 సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చారు. ఈ అంశాలన్నీ కూడా కేవలం ప్రజా ప్రయోజనాల రీత్యా మీ దృష్టికి తెస్తున్నా. ప్రజల తరఫున అసెంబ్లీలో గొంతు విప్పడానికి తగిన సమయం లభించాలనే ఉద్దేశంతో మీకు ఈ లేఖ రాస్తున్నా. అయితే ఇలాంటి పరిస్థితికి ఆస్కారం లేకుండా అధికార కూటమి ఇప్పటికే శత్రుత్వాన్ని ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో నేను సభలో మాట్లాడాలనుకుంటే అది భారీ మెజార్టీ సాధించిన అధికార కూటమి దయమీద, నన్ను చచ్చేవరకూ కొట్టాలన్న స్పీకర్ గారి విచక్షణ మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సభలో ఉన్న పార్టీల సంఖ్యా బలాలను దృష్టిలో ఉంచుకుని ఈ లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

3 సీట్లు వచ్చిన బీజేపీకి సైతం..

ఏపీలో ఆ చానళ్ల ప్రసారాలు వెంటనే పునరుద్ధరించండి

'సాక్షి' సహా పలు చానళ్ల ప్రసారాలు నిలిపివేతపై కేబుల్ ఆపరేటర్లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో నిలిపివేసిన చానళ్ల ప్రసారాలను తక్షణమే పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 6 నుంచి ఏపీలో సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ ప్రసారాలను నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ మిని పుష్కర్ణ మంగళవారం విచారించారు. ఆయా చానళ్లను పునరుద్ధరించాలని కేబుల్ ఆపరేటర్లను ఆదేశించారు. లిఖితపూర్వక ఆదేశాలు ఇంకా వెబ్‌సైట్‌లో పొందుపరచాల్సి ఉంది. ఢిల్లీ హైకోర్టు నిర్ణయంపై న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ ఫెడరేషన్ (ఎన్‌బీఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఏపీలో ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా తీసుకొన్న నిర్ణయంపై కొరడా లాంటి ఆదేశాలుగా అభివర్ణించింది. 'ప్రజాస్వామ్య పనితీరుకు అవసరమైన బహిరంగ, పారదర్శక మీడియా వాతావరణాన్ని నిర్వహించే ప్రాముఖ్యతను హైకోర్టు జోక్యం నొక్కి చెబుతోంది. ఈ తీర్పు పత్రికా స్వేచ్ఛను సమర్థించడం, జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడంపై ఓ ఉదాహరణగా నిలుస్తుంది' అని మంగళవారం ఎన్‌బీఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది.

రైతు భరోసాకు పదెకరాలు పరిమితి పెట్టండి

▶ మొదటి పేజీ తరువాయి

బ్యాంకులకు ఆదాయ పన్ను స్టేట్‌మెంట్లు చూపించాల్సి వస్తుందని.. కాబట్టి ఆదాయ పన్ను చెల్లించేవారికి కూడా రైతుభరోసా ఇవ్వాలని సూచించారు. ప్రతీ వారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు 'రైతు భరోసా'పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములు వంటి వాటికి రైతు భరోసాను నిలిపివేయాలని కోరారు.

దొడ్డు రకాల వరికీ బోనస్ ఇవ్వాలి

సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో.. చాలా మంది రైతులు దొడ్డు రకం వరికి కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో దొడ్డు వరి సాగు చేసేవారే ఎక్కువని, వారికీ బోనస్ ఇస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుందని పేర్కొన్నారు. సన్న రకాలకు ఎటూ డిమాండ్ ఉంటుందని.. మార్కెట్లోనూ మద్దతు ధర కంటే ఎక్కువగా రేటు పలుకుతుందని వివరించారు. ఇక సీజన్ సమయంలో పంటల సాగుకు అవసరమైన కూలీల కొరత ఉంటుందని.. దొరికినా ఖర్చు ఎక్కువ అవుతుందని అనేక మంది రైతులు వాపోయారు. అందువల్ల వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు ఐదేళ్లుగా వ్యవసాయ యంత్రాల సరఫరా నిలిచిపోయిందని, దాంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

రైతుబంధుతో రూ.25,670 కోట్లు వృథా: మంత్రి తుమ్మల

గతంలో సాగులో లేని భూములకు కూడా రైతు బంధు వర్తింపజేసి.. 12 విడతల్లో దాదాపు రూ.25,670 కోట్ల ప్రజాధనం వృథా చేశారని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించారు. 93 శాతం వాటా ఉన్న సన్న, చిన్నకారు రైతుల వాటా రైతుబంధు మొత్తంలో 68 శాతం కూడా లేదని.. దానికితోడు 17.5 శాతం ఉన్న కౌలు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసా పథకాన్ని తీసుకొస్తోందని, పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.15 వేలకు పెంచుతున్నామని చెప్పారు. అయితే రైతుబంధు తరహాలో ప్రజా ధనం వృథా కాకుండా ఉండేలా పటిష్ఠ విధానాల రూపకల్పనకు తమ ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు వెల్లడించిన, రాత పూర్వకంగా సేకరించిన సూచనలను క్రోడీకరించి నివేదిక తయారు చేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని మంత్రి ఆదేశించారు. తమ ప్రభుత్వం రైతుభరోసాకు సంబంధించి ఎటువంటి విధానపరమైన నిర్ణయాలు ఇంకా తీసుకోలేదని.. పూర్తిగా అందరి అభిప్రాయాలు తీసుకున్నాక, శాసనసభలో చర్చించాక పథకాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఆలస్యమైనప్పటికీ అర్హులకు మాత్రమే అందేలా రైతుభరోసాకు రూపకల్పన చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రైతుసంఘం నాయకుడు అన్వేశ్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసాపై రైతులతో మాట్లాడండి

రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ జరపండి: డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పథకాన్ని ఎలా అమలు చేయాలో రైతుల్నే అడిగి తెలుసుకోవా లని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యవసాయ అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల నుంచి అభిప్రాయ సేకరణ జరపాలని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ 'రైతు భరో సాపై రైతుల అభిప్రాయం ఎలా ఉంది? ఈ పథ కం అమల్లో ఎలా ముందుకెళ్లాలో వారిని అడిగి తెలుసుకుంటేనే మంచిదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించి మంత్రులు కూడా హాజరయ్యేలా చూడాలని సూచించారు. అసలు తెలంగాణ ఏర్పాటు కాకముందు రైతుల కోసం అమల్లో ఉన్న పథకాలేంటి? గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన పథకాలేంటి? అందుకు గల కారణాలేంటి? తదితర వివరాలను కూడా అందజేయాలని వ్యవసాయాధికా రులను ఆదేశించారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి తగిన బడ్జెట్ ప్రతిపాద నలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో భాగంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న నేతన్న చేయూత, నేతన్న బీమా పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా గురించి చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత చేనేత కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారు లను ఆదేశించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్‌తో అమలయ్యే పథకాలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తా నియా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

వచ్చే నెల 11న గిరిజన ఉత్పత్తుల ఎంపిక

భద్రాచలంటౌన్: గిరిజనులు రూపొందిస్తున్న ఉత్పత్తులను అమ్మకానికి ఎంపిక చేయడంతో ధర ఖరారు చేసేందుకు వచ్చేనెల 11న సమావేశం నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ జితేష్ వి.పాటిల్ ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజనులు తయారు చేసే అటవీ ఉత్పత్తులతో పాటు చేనేత ఉత్పత్తులను దేశ వ్యాప్తంగా 120 ట్రైఫెడ్ కేంద్రాల ద్వారా విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక చేసిన వాటికి ట్రైఫెడ్ ద్వారా ధర ప్రకటిస్తారని తెలిపారు. ఈకార్యక్రమానికి 50 కిలోమీటర్ల దూరంలోపు నుంచి వచ్చే వారికి రూ.350, 50 కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే వారికి రూ.500 చొప్పున రవాణా ఖర్చులు చెల్లించడమే కాక భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న గిరిజనులు ఉత్పత్తుల నమూనాలతో జూలై 11న ఐటీడీఏ ఆవరణలోని గిరిజన భవన్‌లో జరిగే కార్యక్రమానికి కుల ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 97054 99248, 98485 22841,77949 21516 నంబర్లలో సంప్రదించాలని ఇన్‌చార్జ్ పీఓ తెలిపారు.

ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా చూడాలి



కొత్తగూడెం బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఆర్ఎం, అధికారులు

చుంచుపల్లి: ఆర్టీసీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఖమ్మం రీజనల్ మేనేజర్ ఎ.సరిరామ్ ఆదేశించారు. కొత్తగూడెం బస్టాండ్‌తో పాటు డిపోలోని పలు విభాగాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. బస్టాండ్‌లో షాపుల నిర్వహణ, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, మరుగుదొడ్ల వినియోగంపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డిపోలో సిబ్బంది, బస్సుల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ డిపోల అభివృద్ధికి పాడుపడాలని, రద్దీ రూట్లలో ఎక్కువ సర్వీసులను నడపాలని సూచించారు. డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు, అధికారులు శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్, సునీత తదితరులు పాల్గొన్నారు. ఆతర్వాత కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్‌ను ఆర్ఎం సరిరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

మూషిక జింకల సంతతి అంతంతే..

- కిన్నెరసాని అభయారణ్యంలో పెరగని జీవాల సంఖ్య
- ఆరేళ్ల కిందట హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన అధికారులు
- తొమ్మిదింటిని తీసుకొస్తే రెండు పిల్లలకు జననం
- ఈ ఏడాది రెండు మృత్యువాత



ఆస్ట్రేలియా నుంచి తెప్పించి పెంచుతున్న లెమన్‌గ్రాస్ (ఇన్‌సెట్) కిన్నెరసాని అభయారణ్యంలో పెరుగుతున్న మూషిక జింక



కూరగాయ ముక్కలు తింటున్న మూషిక జింకలు

పాల్వంచరూరల్: ఎలుక మూతిని పోలి ఉండే జింక జాతికి చెందిన మూషిక జింకలు జిల్లా వాతావరణాన్ని తట్టుకోలేకపోతున్నాయి. దీంతో అధికారులు ఆశించినట్లుగా వాటి సంతతి పెరగడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని అభయారణ్యంలో అటవీశాఖ అధికారులు ప్రయోగాత్మకంగా ఆరేళ్ల కిందట మూషిక జింకలను వదిలారు. రూ.లక్షలు వెచ్చించి వీటిని కంటికి రెప్పలా కాపాడుతూ, కావాల్సిన ఆహారం సమకూరుస్తుండగా, సంతతి క్రమంగా పెరుగుతుందనుంటే తగ్గుతుండడం శోచనీయం. అయితే, ఇక్కడి వాతావరణాన్ని మూషిక జింకలు తట్టుకోలేకపోవడం ఓ కారణమని తెలుస్తుండగా.. వీటి జీవితకాలమే తక్కువగా ఉంటుందని మరికొందరు చెబుతున్నారు.

2018లో ఇక్కడకు..

అంతరించిపోతున్న జీవాల జాబితాలో ఉన్న మూషిక జింకల సంతతిని పెంచాలని కేంద్ర జూ అథారిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా 2010 మార్చిలో హైదరాబాద్‌లోని నెహ్రూ జూ పార్క్‌లో మూషిక జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడ సంతతి పెంపునకు కృషి చేస్తున్నారు. ఆపై అనేక జీవజాతులకు ఆలవాలంగా ఉన్న రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు కిన్నెరసాని అభయారణ్యాన్ని కూడా ఎంచుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని జూ పార్క్ నుంచి 2018లో తొమ్మిది మూషిక జింకలను ఇక్కడకు తీసుకొచ్చారు. కిన్నెరసాని అభయారణ్యం పరిధి సంపత్‌నగర్ అటవీ ప్రాంతంలో ఒకటి మగ, మూడు ఆడ మూషిక జింకలను వదిలారు. అలాగే, కిన్నెరసాని డీర్ పార్కులో ఐదు మూషిక జింకలను వదిలారు. కొన్నాళ్లు వీటిని బోన్లలో ఉంచి కావాల్సిన ఆహారం సమకూరుస్తూ ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేలా చేశారు. ఇంతలోనే సంపత్‌నగర్‌కు తీసుకొచ్చిన ఆడ మూషిక జింకల్లో ఒకటి బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో వీటి సంఖ్య ఐదుకు పెరగగా.. వాతావరణానికి అలవాటు పడిందన్న భావనతో అడవిలో వదిలేశారు. మరోపక్క కిన్నెరసానిలోని డీర్ పార్కులో వదిలిన ఐదు మూషిక జింకల్లోనూ ఒకటి జింకకు జన్మనిచ్చింది. దీంతో వీటి సంఖ్య ఆరుకు పెరగడంతో అధికారులు సంతోషించారు. కానీ ఇందులో గత జనవరిలో ఒకటి, ఈ నెల7వ తేదీన ఒక మూషిక జింక మృతి చెందడం గమనార్హం. ఫలితంగా జిల్లాకు తీసుకొచ్చిన తొమ్మిది మూషిక జింకల సంతతి 11కు పెరిగినా రెండు కన్నుమూయడంతో మళ్లీ వాటి సంఖ్య తొమ్మిదికి పడిపోయింది.

ప్రత్యేక ఆహారం

జింకల సంతతిలో అతి చిన్నదైన మూషిక జింక ఎలుక లక్షణాలు కలిగి ఉంటుంది. వీటి పిల్లలు పుట్టిన ఐదు నెలలకే పరిణతి చెందుతాయి. ఆపై గర్భం దాల్చి బిడ్డకు జన్మనిస్తాయి. అయితే, వీటి జీవితకాలం ఐదు నుంచి ఆరేళ్ల వరకే ఉంటుందని తెలుస్తోంది. అందుకే జిల్లాకు తీసుకొచ్చిన మూషిక జింకలు మృతి చెందుతున్నాయనే వాదన ఉండగా.. వాతావరణం పడకపోవడమూ కారణమని ఇంకొందరు చెబుతున్నారు. కాగా, వీటిని కిన్నెరసాని అభయారణ్యానికి తీసుకొచ్చాక ఆహారంగా క్యారెట్, కీర, బీన్స్, దోసకాయల ముక్కలు వేశారు. ఇలా నెలకు రూ.9 వేల చొప్పున ఏటా రూ.1.88 లక్షలు వెచ్చించారు. ఇక ఆరేళ్ల కాలంలో రూ.6.48 లక్షల వరకు ఖర్చు చేసినట్లు అంచనా. అంతేకాక మూషిక జింకలు తినే లెమన్ గ్రాస్ (ఓ రకం గడ్డి)ను ఆస్ట్రేలియా నుంచి తెప్పించి పెంచుతున్నారు. ఇలా రకరకాల జాగ్రత్తలు తీసుకున్నా మూషిక జింకల సంతతి పెరగకపోవడం, ఉన్నవి కన్నుమూస్తుండడం వెనుక కారణాలపై అధికారులు అన్వేషిస్తున్నట్లు తెలిసింది.

ఇక్కడి వాతావరణం తట్టుకోలేక..



అంతరించి పోతున్న మూషిక జింకల సంతతిని పెంచేందుకు జిల్లాను ఎంపిక చేశారు. కిన్నెరసాని అభయారణ్యంలో వీటి పిల్లలను తీసుకొచ్చి పెంచుతున్నాం. తొలుత వాతావరణం విషయంలో అనుమానాలు ఉన్నా సంతతి పెరగడంతో తట్టుకున్నాయని భావించాం. కానీ ఇటీవల రెండు మూషిక జింకలు మృతి చెందడంతో అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతానికి పర్యాటకులకు కనిపించేలా ఇనుప కంచెల్లో వీటిని ఉంచి సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

–బి.బాబు, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ

పామాయిల్ ఫ్యాక్టరీలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు

దమ్మపేట: అశ్వారావుపేటలోని అచార్య ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీని మంగళవారం సందర్శించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల సందర్శనలో భాగంగా వచ్చిన విద్యార్థులు గెలల క్రషింగ్, యంత్రాల పనితీరు, విద్యుత్ ప్లాంట్ పరిశీలించి పనితీరును తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారికి ఫ్యాక్టరీ వివరాలను మేనేజర్ కళ్యాణ్‌గౌడ్ వివరించారు. కాగా, క్షేత్ర స్థాయి పరిశీలనతో అనుభవం పెరగనున్న నేపథ్యాన విద్యార్థులను తీసుకొచ్చినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంతకుమార్ తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ శిరీష, డాక్టర్ గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



యంత్రాలను పరిశీలిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

సింగరేణిలో ఉద్యోగాల మేళా

- ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నోటిఫికేషన్ల జారీ
- మొదటి నోటిఫికేషన్‌కు పూర్తయిన దరఖాస్తుల స్వీకరణ
- ఈసారి ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణకు మణిహారంగా నిలుస్తూ ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థలో ఉద్యోగాల భర్తీకి వరుస నోటిఫికేషన్లు వస్తున్నాయి. ఇటీవలే ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు సంబంధించి 600, ఇంటర్నల్ అభ్యర్థులకు 1,241 పోస్టులతో నోటిఫికేషన్లను విడుదలయ్యాయి. ఇందులో ఎగ్జిక్యూటివ్(అధికారుల కేడర్) పోస్టులు 305 ఉండగా.. నాన్ ఎగ్జిక్యూటివ్(కార్మికుల కేడర్)లో 295 పోస్టులు ఉన్నాయి. ఇక ఇంటర్నల్ పోస్టుల్లోనూ 156 పోస్టులు ఎగ్జిక్యూటివ్ మినహా మిగతావి నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులతో యాజమాన్యం ఫిబ్రవరిలో నోటిఫికేషన్లు విడుదల చేసింది. కాగా, మొదటి నోటిఫికేషన్‌లో గడువు ముగిసే నాటికి పది 10 రకాల పోస్టులకు సుమారు 15వేల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

గడిచిన పదేళ్లలో ఇలా...

సింగరేణి సంస్థ గడిచిన పదేళ్లలో విడుదల చేసిన 58 ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ల ద్వారా 4,207 ఉద్యోగాలు భర్తీ చేసింది. అలాగే, 15,256 డిపెండెంట్ ఉద్యోగాల నియామకం చేపట్టింది. ఇవికాక సంస్థలో పనిచేసే అభ్యర్థుల(ఇంటర్నల్)కోసం 109 నోటిఫికేషన్లతో 3,490 ఉద్యోగాలకు పదోన్నతి కల్పించింది. తద్వారా ఖాళీలు ఏర్పడడంతో కొత్త నియామకాలకు అవకాశం ఏర్పడింది.

తొలిసారిగా ఆన్‌లైన్‌లో...

బొగ్గు ఉత్పత్తిలో రారాజుగా విరాజిల్లుతున్న సింగరేణి సంస్థ ఉద్యోగ నియామకాల్లో పరీక్ష జరిగిన రోజే ఫలితాలు వెల్లడించడం ఆనవాయితీగా వస్తోంది. తద్వారా పైరవీలకు తావు లేకపోగా పూర్తిస్థాయి పారదర్శకత ఉంటోంది. అయితే, రానురాను సింగరేణిలో ప్రభుత్వం, కొందరు ప్రజాప్రతినిధుల జోక్యంతో రిక్రూట్‌మెంట్ సెల్ అబాసు పాలవుతోంది. ఈ చెడ్డపేరు పోగొట్టుకోవడానికి తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ల ఆధారంగా పరీక్షల నిర్వహణ బాధ్యతను ఢిల్లీలోని ఎడ్‌సెల్ సంస్థకు అప్పగించింది. ఈ సంస్థ హైదరాబాద్‌తోపాటు ఇతర పట్టణాలలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. 134ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి తొలిసారి ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనుండడం విశేషం.

మెరిట్ అభ్యర్థులకు న్యాయం జరగాలి



సింగరేణి సంస్థ పరీక్ష జరిగిన రోజే ఫలితాలను విడుదల చేసే విధానానికి శ్రీకారం చుట్టింది. అయితే, ఇటీవల సంస్థ పేరు అభాసుపాలైంది. దీంతో నిర్వహణ బాధ్యతలు ఇంకో సంస్థకు అప్పగించడం బాగుంది. అయితే, పరీక్షలకు సంబంధించి సిలబస్ కూడా ఇస్తే చదువుకోవడానికి వీలయ్యేది.

– వంశీకృష్ణ, ఈఅండ్ఎం అభ్యర్థి

పారదర్శకత కోసమే ఎడ్‌సెల్‌కు...




సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్‌పై అభ్యర్థులకు నమ్మకం కల్పించడం.. పారదర్శకత కోసమే ఈసారి పరీక్షల నిర్వహణ బాధ్యతను ఎడ్‌సెల్ సంస్థకు అప్పగించాం. పరీక్ష జరిగిన రోజే ఏ సంస్థ ఇవ్వని విధంగా సింగరేణి ఫలితాలను విడుదల చేస్తోంది. ఈసారి కూడా అదే ఒరవడి కొనసాగిస్తాం.

– ఎన్వీకే.శ్రీనివాస్, సింగరేణి డైరెక్టర్ (పా)

ఆసరా కాదు... చేయూత

వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందించే పింఛన్ పథకం ఇన్నాళ్లు 'ఆసరా' పేరిట కొనసాగింది. అయితే, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని చేయూతగా మార్చింది. దీంతో గత మూడు రోజుల నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో ఆసరాకు బదులు చేయూతగా కనిపిస్తోంది.

– ఖమ్మంమయూరిసెంటర్



పెన్షన్ల వెబ్‌సైట్‌లో చేయూత పేరిట హోం పేజీ